క్లుప్తంగా

రామలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ పార్వతీ సమేత శ్రీరామలింగేశ్వర స్వామివారి దేవస్థానంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాసశివ రాత్రి సందర్భంగా ఆలయంలో ఉదయం 6.30 గంటలకు రుద్రాభిషేకం, 8 గంటలకు ఏకాదశ రుద్రాభిషేకం, అనంతరం స్వామివారి అలంకరణ చేశారు. ఆలయ శివ సౌధంలో స్వామివారికి కల్యాణోత్సవం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని కల్యాణోత్సవాన్ని తిలకించారు. స్వామివార్లను దర్శించుకోని పూజలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఉయ్యూరు: మండలంలోని పెద ఓగిరాల సబ్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఉయ్యూరు ఈఈ కృష్ణ నాయక్ తెలిపారు. సబ్‌స్టేషన్‌లో విద్యుత్ మరమ్మతులు చేపడుతున్న నేపథ్యంలో ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకూ పెద ఓగిరాల, ఆకునూరు, చిన ఓగిరాల గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సిబ్బందికి సహకరించాలని కోరారు.

మహిళ పట్ల అసభ్యకర ప్రవర్తన

ఐదుగురు బిహార్ యువకుల అరెస్ట్



నిందితులను మీడియా ఎదుట హాజరుపర్చిన పోలీసులు

ఉయ్యూరు: ఒంటరిగా వెళ్తున్న మహిళ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన యువకులను ఉయ్యూరు పోలీసులు సోమవారం అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచారు. నిందితులను సోమవారం రాత్రి మీడియా ఎదుట హాజరు పరిచారు. ఎస్ఐ గణేష్‌కుమార్ తెలిపిన కథనం మేరకు.. మండలంలోని గండిగుంట గ్రామానికి చెందిన మహిళ ఆదివారం అర్ధ రాత్రి షాపు మూసివేసి ఇంటికి వెళ్తున్న సమయంలో గండిగుంట ఎస్సీకాలనీ సమీపానికి చేరుకోగానే పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో గేదెల పాకలో పనిచేసే ఐదుగురు బిహార్ యువకులు ఆమె పట్ల అసభ్యకరంగా ప్రవర్తించి దౌర్జన్యానికి పాల్పడ్డారు. ఘటనలో ఐదుగురు యువకులను అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరిచారు. ఈ ఘటనకు సంబంధించి కొందరు వ్యక్తులు చట్టాన్ని అతిక్రమించి స్కూల్ ప్రాంగణంలోకి ప్రవేశించి అక్కడ పనిచేసే సిబ్బందిని భయభ్రాంతులకు గురిచేశారు. పలువురు సిబ్బంది గాయపడ్డారు. పరస్పర ఫిర్యాదులు నమోదు చేసి కేసు దర్యాప్తు చేస్తున్నామని, త్వరలోనే నిందితులను అరెస్ట్ చేస్తామని పోలీసులు పేర్కొన్నారు.

రేమల్లెలో చైన్ స్నాచింగ్‌పై కేసు నమోదు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: బాపులపాడు మండలం రేమల్లెలో జరిగిన చైన్ స్నాచింగ్ ఘటనపై వీరవల్లి పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్లితే.. ఈ నెల 4న గ్రామానికి చెందిన ఈడే అక్కయ్య భార్య అగ్నేసమ్మ ఇంటి వద్ద ఉండగా ఇద్దరు యువకులు బైక్‌పై వచ్చి తాగటానికి మంచినీళ్లు అడిగారు. ఆమె తాగునీరు ఇచ్చేందుకు దగ్గరకు రాగానే హఠాత్తుగా మెడలోని బంగారు గొలుసు లాక్కుని బైక్‌పై పరారయ్యారు. ఈ ఘటనపై ఆందోళన చెందిన అగ్నేసమ్మ పెద్దగా కేకలు వేస్తూ వెంబడించినా ప్రయోజనం లేకపోయింది. దీంతో సోమవారం వీరవల్లి పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. ఐదు కాసుల విలువైన బంగారు గొలుసు దొంగిలించినట్లుగా ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఘటనపై వీరవల్లి ఎస్ఐ చిరంజీవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ప్రజా సంక్షేమమే వైఎస్సార్ సీపీ అజెండా

- గన్నవరం ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ వంశీమోహన్ విస్తృత ప్రచారం
- అడుగడుగునా బ్రహ్మరథం పట్టిన ప్రజానీకం



బీబీ గూడెంలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి వంశీమోహన్, నాయకులు

గన్నవరంరూరల్: ప్రజల సంక్షేమమే వైఎస్సార్ సీపీ అజెండా అని ఆ పార్టీ గన్నవరం ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ అన్నారు. మండలంలోని బీబీ గూడెం, గొల్లనపల్లి గ్రామాల్లో సోమవారం ఆయన విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీబీ గూడెంలో స్థానిక సహకార బ్యాంకు వద్ద రహదారిపై వంశీకి గ్రామస్తులు అపూర్వ స్వాగతం పలికారు. మేళతాళాలు, తీన్మార్ డప్పులు, పుష్పగుచ్ఛాలు, దండలతో స్వాగతించారు. మంగళ హారతులిచ్చిన మహిళలు వంశీ నుదుటిన కుంకుమ దిద్దారు. దాసరి కాలనీ నుంచి వంశీ ప్రచారం ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ జిల్లా బీసీ విభాగం ప్రధాన కార్యదర్శి సామల ఆంజనేయులు, మాజీ సర్పంచ్ తమ్మిశెట్టి రఘుబాబు, మహిళలు, స్థానిక పార్టీ నాయకులు ఆధ్వర్యంలో గ్రామంలో ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. చీమలవాగు వంతెన, యాదవుల పేట, ప్రధాన సెంటర్, వాటర్ ప్లాంటు మీదుగా ఎస్సీ కాలనీ, కొత్త ఎస్సీ కాలనీలలో వైఎస్సార్ సీపీని ఆశీర్వదిస్తూ మహిళలు పలు చోట్ల హారతులిచ్చారు. పలువురు పాస్టర్లు దైవ ఆశీర్వాదం అందిస్తూ ప్రార్థనలు చేశారు. ఎండలో ప్రచారం చేస్తున్న వంశీకి పలువురు మహిళలు కొబ్బరినీళ్లు అందించారు. వారికి వంశీ కృతజ్ఞతలు తెలిపారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని గెలిపించాలి..

గొల్లనపల్లి బీసీ కాలనీ, పంచాయతీ కార్యాలయం బజార్, గ్రామం మొత్తం ఎన్నికల ప్రచారం కొనసాగింది. ఎంపీ అభ్యర్థిగా డాక్టర్ సింహాద్రి చంద్రశేఖర్, ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని వంశీ అభ్యర్థించారు. పేదలను ఆదుకునే ఏకైక నాయకుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కడేనని చెప్పారు. మరోసారి సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని చేసుకుందామని, ఫ్యాన్ గుర్తు పై ప్రతి ఒక్కరూ ఓటు వేయాలని, సంక్షేమ ప్రభుత్వాన్ని గెలిపించాలని కోరారు. వైఎస్సార్ సీపీ వైద్య విభాగం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ గోసుల శివ భరత్‌రెడ్డి, ఎంపీపీ అనగాని రవి, జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్ రాణి, జెడ్పీ కో-ఆప్షన్ సభ్యుడు ఎండీ గౌసాని, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట వెంకయ్య, పలగాని శోభనాద్రి, పడమట సురేష్, మెండే రమేష్, దద్దనాల రామారావు, కోటగిరి విజయ ప్రసాద్, నారద ముని, కాటూరి రాజు, దేవరపల్లి మల్లికాంబ, కాట్రు ధర్మారావు, అత్తి శ్రీనివాసరావు, సామల వెంకట సుబ్బారావు, ముమ్మనేని శేషయ్య, మేచినేనిబాబు, పాగోలు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వంశీమోహన్‌కు గిరిజన సంఘాల మద్దతు

రామవరప్పాడు: ఎమ్మెల్యే అభ్యర్థి వంశీమోహన్‌కు గిరిజన సంఘాల నాయకులు మద్దతు తెలిపారు. గన్నవరం నియోజకవర్గం బీబీ గూడెంలో సోమవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో వంశీమోహన్‌ను నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మానుపాటి నవీన్, యానాది సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కుడమల రామచంద్రయ్య, ఎరుకుల ఆత్మగౌరవ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మద్దెల రామకృష్ణ మర్యాద పూర్వకంగా కలిసి ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మానుపాటి నవీన్ మాట్లాడుతూ గిరిజన ద్రోహి చంద్రబాబు అన్నారు. టీడీపీ ప్రభుత్వంలో గిరిజనులు అణిచివేతకు గురయ్యారన్నారు. గిరిజనుల అభివృద్ధికి జగనన్న అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి వారి అభ్యున్నతికి తోడ్పాటునందించారన్నారు. రాష్ట్ర భవిష్యత్ కోసం జగనన్నను మళ్లీ సీఎం చేయడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు సింహాద్రి చంద్రశేఖరరావు, వంశీమోహన్కు ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ రాష్ట్ర కోశాధికారి తోకల చిన్న వీరోజి, ఎన్‌టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జగన్నాథం చంటి, బీసీ ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కేసనం హేమంత్ పాల్గొన్నారు.

సాధారణ పౌరుడిలా..



టీ స్టాల్ వద్ద వంశీమోహన్, భరత్‌రెడ్డి, రవి

గన్నవరం: డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ రెండు సార్లు ఎమ్మెల్యే... వరుసగా మూడో సారి విజయం సాధించి హ్యాట్రిక్ కొట్టే దిశగా ముందుకు సాగుతున్నారు. నిత్యం ప్రజల్లో ఉండేందుకు ఇష్టపడే ఆయన సాధారణ పౌరుడిలా అందరితో కలివిడిగా ఉంటారు. ప్రస్తుతం ఎన్నికల ప్రచారంలో బీజీగా ఉన్న ఆయన సోమవారం మచిలీపట్నంలో సీఎం సభకు వెళ్లి తిరుగు ప్రయాణంలో టీ విరామం నిమిత్తం స్థానిక గాంధీబొమ్మ సెంటర్‌లో ఓ టీ స్టాల్ వద్ద ఆగారు. వంశీమోహన్ రాకను గమనించిన చుట్టూ పక్కల ప్రజలు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. అందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ కొద్దిసేపు వారితో ముచ్చటించారు. పార్టీ వైద్య విభాగం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు గోసుల శివభరత్‌రెడ్డి, ఎంపీపీ అనగాని రవి, పార్టీ మండల అధ్యక్షుడు నీలం ప్రవీణ్‌కుమార్ ఉన్నారు.

చంద్రబాబు మాయమాటలు నమ్మొద్దు

ఎమ్మెల్యే అభ్యర్థి జోగి రమేష్



ఈడుపుగల్లు బీసీ కాలనీలో ప్రసంగిస్తున్న మంత్రి జోగి రమేష్

కంకిపాడు: 2014–19 వరకూ సంక్షేమాన్ని, అభివృద్ధిని విస్మరించిన చంద్రబాబు ఎన్నికలు వచ్చే సరికి ఏదో చేసేస్తానంటూ ప్రజల్ని వంచించేందుకు ముందుకు వస్తున్నాడని రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ అభ్యర్థి జోగి రమేష్ విమర్శించారు. మండలంలోని ఈడుపుగల్లు గ్రామంలో సోమవారం రాత్రి ఎన్నికల ప్రచారం విస్తృతంగా నిర్వహించారు. బీసీ కాలనీ, ప్రధాన వీధుల్లో పర్యటించి ఓట్లు అభ్యర్థించారు. ఆయా కూడళ్లలో జరిగిన సభలో మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ.. చంద్రబాబు మాయమాటలు నమ్మొద్దని హితవు పలికారు. సంక్షేమ పథకాలు అమలు జరగాలన్నా, అభివృద్ధి అన్ని రంగాల్లోనూ సాధించాలన్నా వైఎస్సార్ సీపీతోనే సాధ్యమని, సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి విజయాన్ని అందించాలని జోగి రమేష్ కోరారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

నియోజకవర్గంలో నెలకొన్న ప్రధాన సమస్యలను పరిష్కరించే లక్ష్యంతో పనిచేస్తానని మంత్రి జోగి రమేష్ అన్నారు. ఈడుపుగల్లు బీసీ కాలనీలో నాలుగు దశాబ్దాల క్రితం ఇళ్లస్థలాలు ఇచ్చినా రిజిస్ట్రేషన్ సౌకర్యం లేక అవస్థలు పడుతున్నట్లు తన దృష్టికి తెచ్చారన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లో రిజిస్ట్రేషన్ సమస్య పరిష్కరించి బీసీ కాలనీ వాసులకు న్యాయం జరిగేలా చూస్తానన్నారు. అసంపూర్తిగా ఉన్న డ్రెయినేజీ పూర్తి చేస్తానని, షాదీఖానా నిర్మిస్తానని, ఈద్గాకు రెండెకరాల స్థలాన్ని కేటాయించేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. సంక్షేమ పథకాలు అమలు జరగాలంటే మళ్లీ వైఎస్సార్ సీపీకి అధికారాన్ని అప్పగించాలని కోరారు. కార్యక్రమంలో కేడీసీసీ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి, పార్టీ నియోజకవర్గ నేత చలసాని స్మిత గౌతమ్, ఏఎంసీ వైస్ చైర్మన్ మాదు వసంతరావు, మాజీ ఎంపీపీ మాదు శ్రీహరిరాణి, నాయకులు పర్వతనేని సుభాష్, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలి



బ్యాంకు ఖాతాదారులకు అవగాహన కల్పిస్తున్న చీఫ్ మేనేజర్ శివకృష్ణ

పెనమలూరు: బ్యాంకు ఖాతాదారులు సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని పెనమలూరు ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ శివకృష్ణ సూచించారు. బ్యాంకు ఖాతాదారులకు ఆయన సోమవారం ఫైనాన్సియల్ లిట్రసీ, సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శివకృష్ణ మాట్లాడుతూ.. బ్యాంకు ఖాతాదారులకు సైబర్ నేరగాళ్లు తాము బ్యాంకు అధికారులమని ఫోన్ చేస్తారన్నారు. అకౌంట్ అప్‌డేట్, ఈకేవైసీ ఇలా మాయమాటలు చెప్పి ఓటీపీ వివరాలు అడుగుతారన్నారు. పొరపాటున ఓటీపీ నంబర్ చెబితే బ్యాంకు ఖాతాలో సొమ్ము మాయం చేస్తారన్నారు. బ్యాంకు సిబ్బంది ఎవ్వరు ఖాతాదారులను ఫోన్‌లో వివరాలు అడగరనే విషయం ఖాతాదారులు తెలుసుకోవాలన్నారు. అప్రమత్తంగా ఉంటే మోసాలు జరగవని తెలిపారు. కార్యక్రమంలో మేనేజర్ విజయ్ శేఖర్, బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.

నున్న బ్రాంచిలో అవగాహన

నున్న(విజయవాడరూరల్): బ్యాంక్ ఖాతాదారులు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్‌బీఐ నున్న బ్రాంచి చీఫ్ మేనేజర్ ఎస్.మనోజ్ కార్తీక్ తెలిపారు. నున్న బ్రాంచిలో సైబర్ నేరాలపై ఖాతాదారులకు అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మనోజ్ కార్తీక్ మాట్లాడుతూ.. మొబైల్స్ ఫోన్లకు పరిచయం లేని వ్యక్తుల ఫోన్ల నుంచి కాల్స్, మేసేజ్‌లు వస్తున్నాయని వాటిని పట్టించుకోవద్దన్నారు. బ్యాంక్ సంబంధిత మెసేజ్‌లు మీ మొబైల్స్‌కు వచ్చిన వెంటనే దగ్గర్‌లోని బ్యాంక్ మేనేజర్‌ను సంప్రదించాలని, లేకుంటే టోల్ ఫ్రీ నంబరు 18001122 11కు సంప్రదించాలన్నారు. ఏదైనా సైబర్ నేరం జరిగిన వెంటనే 1930 నంబర్‌కు కాల్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.

జంక్షన్‌లో అవగాహన

హనుమాన్‌జంక్షన్‌రూరల్: సైబర్ నేరాల పట్ల బ్యాంకు ఖాతాదారులు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌బీఐ హనుమాన్‌జంక్షన్ శాఖ సీనియర్ మేనేజర్ ఎస్.వెంకటేశ్వరరావు తెలిపారు. స్థానిక విజయవాడరోడ్డులోని స్టేట్ బ్యాంక్‌లో ఖతదారులకు 'ఆర్థిక అక్షరాస్యత, సైబర్ నేరాలు'పై అవగాహన సదస్సును సోమవారం నిర్వహించారు. గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్లు చేసి ఏటీఎం పిన్, ఓటీపీ, నెట్ బ్యాంకింగ్, క్రెడిట్ కార్డు వివరాలను అడిగితే చెప్పవద్దని సూచించారు. ఏటీఎం కేంద్రాల్లోనూ అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో కస్టమర్ సర్వీస్ మేనేజర్ బి.రేఖ, సిబ్బంది పాల్గొన్నారు.

యువతకు తీన్మార్ బ్యాండ్ వితరణ



రామచంద్రాపురంలో బ్యాండ్ అందజేస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు విజయ్‌కుమార్ తదితరులు

గన్నవరంరూరల్: మండలంలోని సూరంపల్లి శివారు గ్రామం రామచంద్రాపురానికి చెందిన యువతకు సూరంపల్లి తోట సీతారావమ్మ, సీతారామయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చైర్మన్ తోట వెంకయ్య సోమవారం వితరణగా రూ.60 వేలు విలువైన తీన్మార్ బ్యాండ్ ఫుల్‌సెట్ అందజేశారు. వీటిని ట్రస్ట్ సభ్యులు తోట విజయ్‌కుమార్ వారికి అందజేశారు. ఈ సందర్భంగా వెంకయ్య మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో యువత ఉద్యోగాలు, ఉపాధితో పాటు సాంస్కృతికంగా ఎదగాలన్న ఆకాంక్షతో వారిలోని ఆసక్తిని గమనించి ఈ సహాయం అందజేశామన్నారు. యువత తీన్మార్ ద్వారా మరింత ఉపాధిని సాధిస్తారని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు కందిమళ్ల శ్రీనివాసరావు, ప్రత్తిపాటి రాజా, తుల్లిమిల్లి ఏడుకొండలు, పామర్తి మాధవరావు, కందిమళ్ల రాఘవ, కూరాకుల కోటేశ్వరరావు, కోటగిరి ప్రసాద్, కోటగిరి రాజాబాబు, బండి వెంకటేశ్వరరావు, తోట ప్రశాంత్, సర్నాల లక్ష్మణరావు, సర్నాల రాంబాబు పాల్గొన్నారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించండి



ఎనికేపాడులో ప్రచారం చేస్తున్న రాచమళ్ల పూర్ణ, కోనేరు సుబ్బారావు తదితరులు



తేలప్రోలులో ఆదినారాయణరెడ్డి ఆధ్వర్యంలో..



దుర్గాపురంలో ప్రచారం చేస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

రామవరప్పాడు: రాష్ట్రంలో సుపరిపాలన అందిస్తున్న సంక్షేమ ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని ఎనికేపాడు సర్పంచ్ రాచమళ్ల పూర్ణచంద్రరావు కోరారు. విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడులో గన్నవరం ఎమ్మెల్యే అభ్యర్థి వల్లభనేని వంశీమోహన్ విజయాన్ని కాంక్షిస్తూ సోమవారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. పార్టీ నాయకులు కోనేరు సుబ్బారావు, ఎంపీటీసీ, వార్డు సభ్యులు, కార్యకర్తలతో కలిసి గ్రామంలోని పలు ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. తమ రెండు ఓట్లను ఫ్యాన్ గుర్తుపై వేసి అఖండ విజయం చేకూర్చాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ పార్టీ కన్వీనర్ మాదు సుబ్బారావు, ఎంపీటీసీలు రాచమళ్ల రత్నకుమారి, గంగుల శ్రీనివాస్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

నున్న(విజయవాడరూరల్): ఫ్యాను గుర్తుపై ఓట్లు వేసి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావు, డాక్టర్ వల్లభనేని వంశీమోహన్లను గెలిపించాలని కోరుతూ నున్నలో పార్టీ నాయకులు ప్రచారం నిర్వహించారు. 6వ వార్డులో ఇంటింటికెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల కరపత్రాలను అందజేశారు. ఇదే సందర్భంలో బ్యాలెట్ నమూనా పేపరులో ఫ్యాను గుర్తుపై 3వ నంబరులో ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల పేర్లు ఉంటాయని, ఓట్లు వేయాలని అవగాహన కల్పించారు. గ్రామ పార్టీ కన్వీనర్ పోలారెడ్డి చంద్రారెడ్డి, నాయకులు యనగంటి దుర్గాప్రసాద్, పెండెం కోటేశ్వరరావు, దొంతిరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, దండు సుబ్రహ్మణ్యంరాజు పాల్గొన్నారు.

ఉంగుటూరు: మండలంలో పలు గ్రామాల్లో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థులకు మద్దతుగా పార్టీ నాయకులు సోమవారం ప్రచారం నిర్వహించారు. తేలప్రోలులో మండల జేసీఎస్ కన్వీనర్ వింత ఆదినారాయణరెడ్డి పాల్గొని ప్రచారం చేశారు. పెద అవుటపల్లి, మానికొండ, తరిగొప్పల, తదితర గ్రామాల్లో గ్రామ పార్టీ నాయకులు ప్రచారం నిర్వహించారు. నాయకులు మాదు సాంబశివరావు, భీమవరపు యతేంద్రరామకృష్ణ, రవికుమార్, రవీంద్రరెడ్డి, నాని, ప్రసాద్ పాల్గొన్నారు.

గన్నవరం: వైఎస్సార్ సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు డాక్టర్ సింహాద్రి చంద్రశేఖర్‌రావు, డాక్టర్ వల్లభనేని వంశీమోహన్‌కు మద్దతుగా గ్రామాల్లో ప్రచారాన్ని ఆ పార్టీ నేతలు ఉధృతం చేశారు. మండలంలోని కేసరపల్లి శివారు దుర్గాపురంలో జెడ్పీటీసీ అన్నవరపు ఎలిజబెత్‌రాణి, వైస్ ఎంపీపీ కాలగడ్డ శివనాగరాజకుమారి, సర్పంచి చేబ్రోలు లక్ష్మీ మౌనిక, పలువురు వార్డు సభ్యులు గడప గడపకు ప్రచారం చేశారు. స్థానిక చింతలపేటలో సచివాలయ కన్వీనర్ పాగోలు సురేష్ నేతృత్వంలో ప్రచారం జరిగింది. బుద్ధవరం గ్రామపంచాయతీ పరిధిలో ఉపసర్పంచి వేల్పూరి బసవరావు ఆధ్వర్యంలో సింహాద్రి, వంశీకి మద్దతుగా భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఎస్సీ కాలనీలో వంశీమోహన్‌కు మద్దతుగా రాచేటి రూతమ్మ నేతృత్వంలో ప్రచారం చేశారు.

గన్నవరంరూరల్: మండలంలోని సూరంపల్లి గ్రామంలో సోమవారం రాత్రి వైఎస్సార్‌సీపీ ఎన్నికల ప్రచారం ముమ్మరంగా కొనసాగింది. గ్రామ కన్వీనర్ కందిమళ్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పీఏసీఎస్ చైర్మన్ తుల్లిమిల్లి ఏడుకొండలు, రాయల మహేంద్ర, గోసాల కోటేశ్వరరావు, పామర్తి మాధవరావు, భూక్యా కోటేశ్వరరావు తదితరులు పాల్గొని ప్రచారం చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు బాపులపాడులో వంశీ ప్రచారం

హనుమాన్‌జంక్షన్ రూరల్: మండల కేంద్రమైన బాపులపాడు, వీరవల్లి గ్రామాల్లో గన్నవరం ఎమ్మెల్యే అభ్యర్థి వల్లభనేని వంశీమోహన్ మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు నక్కా గాంధీ, జేసీఎస్ మండల కన్వీనర్ ఆవిర్నేని శేషగిరిరావు తెలిపారు. ఉదయం 6 గంటలకు వీరవల్లి, నారాయణపురం, శోభనాద్రిపురం, కోడూరుపాడు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారన్నారు. అనంతరం బాపులపాడులో ఎన్నికల ప్రచారం ప్రారంభిస్తారని తెలిపారు. రైల్వేస్టేషన్, కృష్ణానగర్, నూజివీడు రోడ్డు, మహాత్మగాంధీ నగర్, ఎస్సీ కాలనీ, తారకరామ కాలనీ, ఐటీఐ రోడ్డు, కేఎస్ టాకీస్, విజయవాడరోడ్డు, హనుమాన్ నగర్, ఇందిరా నగర్, పాండురంగారావు నగర్, బీసీ కాలనీ ఏరియాల్లో వంశీ ప్రచారం చేస్తారని తెలిపారు.

మల్లేశ్వరస్వామి గుడి అభివృద్ధి పనుల పరిశీలన



అధికారులతో చర్చిస్తున్న ఈవో రామరావు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై ఉన్న మల్లేశ్వరస్వామి ఆలయం వద్ద శరవేగంతో జరుగుతున్న ఆలయ అభివృద్ధి పనులను సోమవారం ఆలయ కార్యనిర్వహణాధికారి కేఎస్ రామరావు పరిశీలించారు. అభివృద్ధి పనుల పురోగతి గురించి ఇంజినీరింగ్ అధికారులను అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు. మల్లేశ్వర స్వామివారిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు అసౌకర్యం కలుగకుండా పనులను మరింత వేగవంతం చేయాలని సూచించారు.

పోస్టల్ బ్యాలెట్‌లో 437 ఓట్ల పోలింగ్



ఓటు వేసేందుకు వేచి ఉన్న ఓటర్లు

పెనమలూరు: పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌లో భాగంగా సోమవారం 437 ఓట్లు పోల్ అయ్యాయి. పెనమలూరు నియోజకవర్గ పరిధిలో మొత్తం పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 1,782 మంది ఉన్నారు. మూడో రోజైన సోమవారం ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులు అత్యవసర సర్వీసులు, పోలీసులు, ఇతరులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు 535 మందికి గాను 437 మంది ఓటు వేశారు. ఇప్పటి వరకు 1,782 మందిలో 1,644 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇంకా 138 మంది ఓటు వేయాల్సి ఉంది. ఓటు వేయని వారికి మంగళ, బుధవారాల్లో పెనమలూరు తహసీల్దార్ కార్యాలయం, పెనమలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఓటు వేయటానికి అవకాశం కల్పిస్తున్నట్లు ఏఆర్వో ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు.

కొనసాగుతున్న పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్

గన్నవరం: స్థానిక జెడ్పీ బాలురోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్‌లో సోమవారం ఓటింగ్ కొనసాగింది. ఎన్నికల విధులకు కేటాయించిన పోలీస్, వైద్య, ఆర్టీసీ, రైల్వే, ఎస్ఎస్ఎస్, అత్యవసర విభాగాలకు చెందిన సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా మొత్తం 265 మంది సిబ్బందికిగాను 203 మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. మొత్తం 76.60 శాతం పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ నమోదైందని ఎన్నికల అధికారులు తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియను నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి గీతాంజలిశర్మ పర్యవేక్షించారు.

ఆరుగురు జూదరుల అరెస్ట్

పెనమలూరు: పేకాట ఆడుతున్న ఆరుగురు జూదరులను పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. పెనమలూరు సీఐ టీవీవీ రామారావు తెలిపిన వివరాల ప్రకారం పెదపులిపాక గ్రామ పరిధి ఖాళీ స్థలంలో ఆరుగురు వ్యక్తులు పేకాట ఆడుతుండగా పోలీసులు వారిని అదుపులోకి తీకున్నారు. వారి వద్ద రూ.5,210 నగదును స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేశామని చెప్పారు.

పెనమలూరులో ముమ్మరంగా ప్రచారం



పెనమలూరులో ప్రచారం చేస్తున్న మాజీ సర్పంచి వెంకటేశ్వరరావు



ఉయ్యూరులో ఇంటింటి ప్రచారం చేస్తున్న నాయకులు

పెనమలూరు: పెనమలూరు నియోజకవర్గ వ్యాప్తంగా ఎన్నికల ప్రచారం ముమ్మరంగా కొనసాగుతోంది. పెనమలూరు గ్రామంలో మాజీ సర్పంచి కిలారు వెంకటేశ్వరరావు, సొసైటీ అధ్యక్షుడు కొత్తపల్లి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో సోమవారం ఎన్నికల ప్రచారం చేశారు. జగనన్నను మళ్లీ గెలిపిస్తే సంక్షేమ పథకాలు కొనసాగుతాయన్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు కంచర్ల సుధీర్, తెన్నేటి ప్రకాష్, మాణిక్యాలరావు, జగన్ పలువురు పాల్గొన్నారు. కానూరులో వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి చాంద్‌బాషా ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జగనన్నను నమ్ముకుంటేనే ప్రజలకు సామాజిక న్యాయం జరుగుతుందన్నారు. సనత్‌నగర్‌లో సీనియర్ నేత సిద్దిక్ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం చేపట్టారు. జగనన్న గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలు 99 శాతం అమలు చేశారన్నారు. గాదె శ్రీకాంత్, జహీర్, ముసా, ఇమ్రాన్ పాల్గొన్నారు. యనమలకుదురు ఇందిరానగర్‌లో అష్రఫ్ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సలీం, కోసూరి నరేష్‌కుమార్, కత్తెర బాషా, నాగరాజు, మున్నా, ముబిన్, లంకా కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఉయ్యూరు: జగన్ కోసం సిద్ధం ప్రచారం ప్రారంభమైంది. ఉయ్యూరులో పార్టీ శ్రేణులు సోమవారం ఇంటింటికీ వెళ్లి జగన్ కోసం సిద్ధం అంటూ కరపత్రాలు పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీకి అఖండ విజయాన్ని అందించాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికల మేనిఫెస్టోని వివరించారు. ఒకటో వార్డులో కౌన్సిలర్ గుంజా సుధాకర్, 15వ వార్డులో ముడావత్ లక్ష్మి, పలువురు కౌన్సిలర్లు, పార్టీ శ్రేణులు ప్రచారంలో పాల్గొన్నారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్ అబు కలాం ప్రచార కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.



సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

పెనమలూరు డివిజన్
90105 77706 (ఉయ్యూరు)
99122 20539 (పెనమలూరు)
90102 10382 (గన్నవరం)
Office mail : sakshiads@gmail.com